ఆంధ్రభూమి దినపత్రిక కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# ప్రతిధ్వని



**ఆ**గస్టు 16.

మోపెడ్ మీద పిల్లల్ని తీసుకెళ్ళి స్కూల్లో దింపి వెనుదిరిగింది అనన్య.

ఇల్లు అల్లంత దూరాన ఉందనగా పోలీసులు ఆమెని ఆపేశారు. రోడ్డు బారికేడ్లతో మూసేశారు.

ఆ హఠాత్పరిణామానికి విస్తుబోయింది. "మేం ఇంటికెళ్ళకుండా ఇలా రోడ్డు మూసేస్తే ఎలాగా?" ఒక జవానుని ప్రశ్నించింది.

"కన్పించట్లా? ఇటు వెళ్ళడానికి లేదు. ఫో ఫో..." కసురుకున్నాడు.

"అదిగో ఆ పైదే మా ఇల్లు. మా ఇంటికి మేం వెళ్ళకుండా రోడ్డు బ్లాక్ చేసేస్తే ఎలాగా?" గొంతు పెంచింది అనన్య.

"ఛలో ఛలో.. చెబితే నీక్కాదూ. ఇంకో దారి చూసుకో. ఫో..." ఛీత్కరించాడు.

"ఆ సమాధానం ఏంటి? పబ్లిక్ రోడ్‌ని ఇలా కబ్జా చెయ్యడమేంటి? అడ్డు తప్పుకోండి. నేను వెళ్ళాలి..." మొండిగా బారికేడ్ తొలగించ బోతోంటే అతడామెని తోసేసి బూతులు తిడుతూ కరిచినంత పని చేశాడు.

ఆమె కింద పడిపోయింది. చటుక్కున లేచి ఆవేశంతో ఊగిపోతూ దగ్గర్లోని పోలీసు అధికారి దగ్గరికి దూసుకెళ్ళింది.

ఆ చుట్టు పక్కలి ఇళ్ళ వాళ్ళు – అంతదాకా నిస్సహాయంగా నిలబడిపోయిన వాళ్ళు కూడా ఆమెని అనుసరించారు.

"అతడలా దౌర్జన్యం చేస్తోంటే చూసి కూడా పట్టించుకోరేం?"

"కూల్ డౌన్. నేను చెప్పేది విను. ముఖ్యమంత్రి అయిదువేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడించడాని కొస్తున్నాయి. ముందస్తు చర్యగా సీఎం గారి ఇంటి చుట్టూ ఉన్న రోడ్లన్నీ బ్లాక్ చేశాం..."

"మరి మేం ఇంటికెలా వెళ్ళాలి?"

కోపంగా చూశాడు. "ఊరికే అరవొద్దు. ఏ సందు గొందుల్లోంచో ఫో. ఫో ఫో..."

"ముఖ్యమంత్రి మీది ఆరోపణలు ఆయన వ్యక్తి గతమైనవి. వ్యక్తిగతంగానే ఎదుర్కోవాలి తప్ప ఇలా అధికార దుర్వినియోగం చేస్తే ఎలా? ప్రజలకు ఇబ్బంది కల్గించడమేగాక ఇలా వేలాది మంది పోలీసుల పనిదినాలు వృథా చెయ్యడం సరికాదు. మీకిస్తోన్న జీతభత్యాలు ఆయన జేబు నుండి కాదు మా కష్టార్జితాన్ని టాక్సులుగా చెల్లిస్తుంటే ఇస్తున్నారని గుర్తుంచుకోండి"

"ఇదేమైనా అసెంబ్లీ అనుకున్నావా ఊరికే నోరు పారేసుకుంటున్నావ్... పోతావా పోవా..." ప్రక్కనున్న పీసీ చేతుల్లోని లాఠీ తీసుకుని ఝుళిపించాడు.

"రోడ్డు క్లియర్ చేసే దాకా వెళ్ళను గాక వెళ్ళను" నడి రోడ్డు మీద బైఠాయించింది.

'అవునంతే' అంటూ మిగతా జనమూ ఆమెకి సపోర్టుగా కూర్చుండిపోయారు.

'ఇక్కడ సీఎం ఇల్లు ఉన్నంత మాత్రాన ఈ ప్రాంతంలో ఎవరూ నివసించకూడదా? ఈ రోడ్ల మీద తిరక్కూడదా?' అని జనం తర్కించుకుంటున్నారు. మరింత జనం పోగయ్యారు ఏమిటేమిటంటూ.

ఓ వార్తా ఛానల్‌కు వార్త తెలిసి వారి వ్యాన్ ఆగమేఘాల మీద వచ్చేసింది.

ఓ విలేఖరి మైక్ పట్టుకుని అనన్య దగ్గరికొచ్చాడు "ముఖ్యమంత్రి నివాసం ముందు మీరెందుకు నిరసన దీక్షకు కూర్చున్నారు? మీ డిమాండ్లేమిటి? అవినీతి ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యాలనా? లేక ఏకంగా ప్రభుత్వాన్నే బర్తరఫ్ చెయ్యాలని కోరుతున్నారా?"

"రోడ్డు మీది బారికేడ్లు తొలగించమంటే మహిళనని కూడా చూడకుండా దౌర్జన్యానికి పూనుకున్నారు"

"పోలీసుల మీద చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారన్న మాట"

"ప్లీజ్... రోడ్డు క్లియర్ చేస్తే చాలు క్షేమంగా ఇంటి కెళ్ళిపోతాను"

జనమూ పత్రికల వారూ న్యూస్ ఛానళ్ళూ అమాంతం పెరిగాయి. లైవ్‌లో వార్త ప్రసారం చెయ్యాసాగారు.

పోలీసు అధికార్లకు దిక్కుతోచలేదు. ఏం చేస్తే ఏం ముంచుకొస్తుందోనని భయపడుతూ సీఎం పిఏకి చెప్పారు.

"నీకేమైనా సెన్సుందా? న్యూసెన్సు కేసుని సీఎమ్ గారి దృష్టికి తేవాలా? వెళ్ళెళ్ళు. ఫైవ్ మినిట్స్‌లో మేటర్ క్లియర్ అయిపోవాలి"

లాగి విడిచిన బాణంలా బయటికి దూసుకొచ్చి, "ఠాణాకు తీసుకుపోండి" అని హుకుం జారీ చేశాడు.

ఆ వెంటనే పోలీసు వ్యాన్ రావడం, మగ పోలీసులే అనన్యని బలవంతాన లాక్కెళ్ళి ఎక్కించడం, ఎర్ర బుగ్గ వెలుగుతూండగా సైరన్ శబ్దం చేస్తూ తీసుకెళ్ళి పోవడం–చకచకా జరిగిపోయాయి.

'పబ్లిక్ రోడ్డు మీద పబ్లిక్‌ని ఎందుకు నడవనివ్వరని ప్రశ్నించినందుకు అరెస్టా? అన్యాయం!' అంటూ కొందరు జనం అడ్డుకోజూశారు గాని పోలీసులు లాఠీలు ఝుళిపించి వాళ్ళని తరిమేశారు.

"మీరెవరు? మీ వెనుక ఉన్నదెవరు? అందర్లా సర్దుకుపోకుండా ఎదిరించారంటే మీకేదో రహస్య ఎజెండా ఉండి ఉండాలి. అదేమిటి?" పోలీస్ స్టేషన్లో సూటిగా ప్రశ్నించాడు పోలీసు అధికారి.

"క్షమించాలి. నేను సామాన్య గృహిణిని మాత్రమే... బారికేడ్లు తీయమన్నందుకిలా అరెస్టు చెయ్యడం అన్యాయం"

"ఆ ఏరియాలో ఉంటున్న మిగతా వాళ్ళలా ఇంకో దారిలో వెళ్ళొచ్చుగా. ఎందుకు ఎడ్డస్టవ్వరు?"

"నేను తలొంచుకుని ఎందుకు వెళ్ళాలి? ఆ రోడ్డు సీఎం గారి స్వంతమా?"

"అతి తెలివిగా మాట్లాడొద్దు. ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడించబోతున్నారు. ఆయనకీ ప్రభుత్వ ఆస్తులకీ పూర్తి రక్షణ ఇచ్చి లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన బాధ్యత మా మీద ఉంది"

"నాలాంటి పౌరుల్ని రక్షించడం, క్షేమంగా ఇల్లు చేరేందుకు సహకరించడం మీ బాధ్యత కాదా?"

"ష్. వాదన లొద్దు. మిమ్మల్ని వదిలేస్తాం. మీ మానాన మీరు వెళ్ళిపోండి"

"నన్నెక్కడ్నుంచి తీసుకొచ్చారో అక్కడ వదలండి. నా మోపెడ్ అక్కడే ఉంది. నేనింటి కెళ్ళడానికి బారికేడ్లు తొలగించండి"

"ఆల్‌రైట్. వెళ్ళనిస్తాంగాని మళ్ళీ ఆ రోడ్డుకేసి రాకూడదు"

"హౌస్ అరెస్టా? స్కూల్నుంచి మా పిల్లల్నెలా ఇంటికి తీసుకురాను?"

ఇంతలో, "చిలికి చిలికి గాలివాన చేస్తోంది మీడియా. హెచ్చరించి వదిలెయ్" బాస్ ఫోన్‌లో ఆదేశమిచ్చాడు.

అయిష్టంగానే అనన్యని తీసుకెళ్ళి ముఖ్యమంత్రి ఇంటి దగ్గర దింపారు. పక్కన పడేసిన మోపెడ్ తీసుకుని, "బారికేడ్ తీసి దారివ్వండి" అందామె. విననట్టు ఉండిపోయారు పోలీసులు.

బారికేడ్ జరుపుతున్నట్టు నటిస్తూ దాన్నామె మీదకి త్రోసేరు. మోపెడ్‌తో సహా పడిపోయింది. తలకి గాయమైంది.

జనం రెచ్చి పోయారు. జనాన్ని చెదరగొట్టడానికి లాఠీలు ప్రయోగించారు.

అదే సమయంలో ప్రతిపక్షపు కార్యకర్తలు ఊరేగింపుగా రాసాగారు. మరి తాత్సారం చెయ్యకుండా అనన్యని బలవంతంగా పోలీసు వ్యానెక్కించారు. జనం మీదకి భాష్పవాయువు ప్రయోగించారు.

'బ్రేకింగ్ న్యూస్! పట్ట పగలే సీఎం ఇంటి ముందు లాఠీల స్వైర విహారం! దారిమ్మని కోరిన గృహిణిపై ఖాకీల దౌర్జన్యం! పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్న జనం!" – టీవీలో స్క్రోలింగ్!

ఒక ఛానల్ అనన్యకి తీవ్రవాదుల్తో సంబంధాలున్నాయనీ, అరాచకాన్ని సృష్టించడానికి ప్రయత్నించిందనీ పేర్కొంది.

జనం దృష్టి ప్రతిపక్షపు ముట్టడి కార్యక్రమం మీంచి అనన్య ఉదంతం మీదకు మళ్ళింది. ఆమె మీద సానుభూతి పెల్లుబికింది.

సామాజిక సైట్లు యాక్టివ్ అయ్యాయి. వేలాది మెదళ్ళు కుతకుత ఉడకసాగాయి!

* * *

"నన్నెందుకు అరెస్టు చేశారు?" స్టేషన్‌లోని ఏసీపీని ప్రశ్నించింది అనన్య.

"పోలీసుల విధులకు అడ్డుపడినందుకూ. నిషేదాజ్ఞలు ఉల్లంఘించినందుకూ అరెస్ట్ చేశాం" అన్నాడు ఏసీపీ.

"నా ప్రాథమిక హక్కు గురించే కదా నేనడిగింది?" అనన్య ప్రశ్నించింది.

"అది కోర్టులో చెప్పుకో"

ఆమెని మగ నేరస్తుల్తో బాటు లాకప్ రూంలో పడేశారు. "ఇది అన్యాయం" అంటే, "లాకప్ రూంలు ఖాళీ లేవు" అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ.

కోపం, దుఃఖం జమిలిగా వస్తోంటే భర్తకు ఫోన్ చేసింది. పిల్లల్ని స్కూలు నుంచి తీసుకురమ్మని చెప్పింది.

అనన్యకి ఆకలిగా వుంది. మిగతా వాళ్ళకి అన్నం పొట్లాలిచ్చారు. ఆమెకివ్వ లేదు. దాహంగా ఉందన్నా గుక్కెడు నీళ్ళివ్వలేదు.

లాల్చీ పైజమా ధరించి భుజాన సంచితో వచ్చాడు నారదుడు. అతడు 'డేంజరస్ జర్నలిస్టు' అని పోలీసుల ఏకాభిప్రాయం.

'నమస్తే మేడమ్. మిమ్మల్ని విప్లవమూర్తి అనాలా చైతన్యస్ఫూర్తి అనాలా!"

"మామూలు మనిషిని"

"ఈ దేశంలో నాయకులవీ అధికార్లదీ ప్రత్యేక వర్గం. వారికి స్పెషల్ ప్రివిలేజులూ సౌకర్యాలూ అడుగడుగునా రాచమర్యాదలూ ఉంటాయి. దాన్ని ముద్దుగా విఐపీ కల్చర్ అంటారు. మిగతా అమాంబాపతు జనమంతా వాళ్ళకి దారిచ్చి సలాము చెయ్యాల్సిందే. అదే మన ప్రజాస్వామ్యం. మీ తాపత్రయంగానీ ఈ దేశాన్నెవరూ బాగు చెయ్యలేరు!" అనేసి వెళ్ళిపోయాడు.

ఆమె ఆలోచనలో పడింది.

ఆమె భర్త అప్పారావు ఆమె పిల్లలూ వచ్చారు. కటకటాల వెనుకనున్న తల్లిని చూచి నిభాయించుకోలేక ఏడ్చేశారు.

"కొరివితో తల గోక్కున్నావు. నా చిన్ని పొట్టకు శ్రీరామ రక్ష అనుకోవాలి తప్ప ఈ గొడవలు మనకెందుకు చెప్పు? తప్పైపోయింది క్షమించమని రాసిస్తే వదిలేస్తామన్నారు" అంటూ పెన్నూ కాగితం అందించాడు.

"సారీ. రాసివ్వను. బొగ్గు మెక్కారు. గనులు మ్రింగారు. టూజీలు అమ్ముకున్నారు. సెజ్‌లు పంచుకున్నారు. ఆదర్శ ప్లాట్లూ తిన్నారు. జనం నెత్తిన ఇంత థర్మల్ బూడిద

పోశారు. అయినా నేను నోరు తెరవలేదే. నడిచే దారిని కూడా కబళించేస్తే ఎలా ఊరుకోను?"

అతడెంత నచ్చ చెప్పినా రాజీ పడటానికి ఇష్టపడలేదు. అఘోరించమని చెప్పి విసురుగా వెళ్ళిపోయాడతడు.

మీడియా హడావిడి ఎక్కువైంది. ప్రతిపక్షాలు తమ సపోర్టును ప్రకటించాయి.

కొందరు యువనాయకులొచ్చి ఆమెను కలిశారు.

"ప్రజల చేత ప్రజల కొరకు ప్రజల వల్ల ఏర్పడిన ప్రభుత్వం! ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశం! కాని జనానికి రోడ్డు మీద నడిచే హక్కు కూడా లేదు! గొంతెత్తి ప్రశ్నించినందుకు అభినందిస్తున్నాం" అన్నారు.

పరిస్థితి ప్రభుత్వ వ్యతిరేకంగా మారుతోందని గ్రహించి, డీసీపీని రంగంలోకి దించారు ముఖ్యమంత్రి సన్నిహితులు.

"మీడియా వాళ్ళు సెన్సేషన్ కోసం టీకప్పులో తుపాను సృష్టిస్తున్నారు, వదిలెయ్. నీ బ్యాక్ గ్రౌండ్ చెక్ చేశాను. మీది కామ్ గోయింగ్ ఫ్యామిలీ. వదిలెయ్. ముఖ్యమంత్రి ప్రివిలేజెస్‌ని ప్రశ్నించడం సరికాదు వదిలెయ్..." అనన్యని కలిసి అన్నాడాయన.

"ఎందుకని? అతడూ నాలాటి వాడేగా. ప్రజలకి సేవ చేస్తానన్నాడు. కుర్చీ మీద కూర్చోబెట్టారు. అందుకని జనం మీద స్వారీ చేస్తానంటే ఎలా? సాధారణ పౌరుడిగా ఉంటూ అధికార బాధ్యతలు నిర్వర్తించొచ్చుగా? సుందరయ్య సైకిల్ మీద అసెంబ్లీకెళ్ళలేదా? త్రిపుర సీఎం మాణిక్ సర్కార్ నిరాడంబరంగా విధులు నిర్వర్తించడం లేదా? ఈ హైసెక్యూరిటీలూ ఎర్ర బుగ్గకార్లూ రాజదర్పాలూ అట్టహాసాలూ ఎందుకు? జనాన్ని ఇబ్బందుల పాలు చెయ్యడం ఎందుకు? రోడ్లు, నీళ్ళు, కరెంటు, రక్షణా అన్నీ, అంతా వాళ్ళకే. జనానికేమో చిత్రమైన నరకం! ఇది న్యాయమా చెప్పండి?"

విషపు నవ్వు నవ్వి వెళ్ళిపోయాడా అధికారి.

అప్పారావు అనన్యకి కేరియర్ తెచ్చాడు. తామే భోజనం అరేంజ్ చేస్తామని చెప్పారు పోలీసులు. అతడు తీసుకొచ్చిన ప్లీడర్తో ఆ మర్నాడు కోర్టు అనుమతితో మాట్లాడమని చెప్పి పంపేశారు.

* * *

అనుచరుల్తో కలిసి అభిలాష్ స్టేషన్‌కి వచ్చాడు. అతడు ముఖ్యమంత్రి కొడుకు. కాబోయే ముఖ్యమంత్రి అని ప్రచారం జరుగుతోంది.

"మనం యూత్. మార్పు మనవల్లే సాధ్యం. మనమంతా కలుద్దాం. యువ భారతం సృష్టిద్దాం. యువతకు పాలనాధికారం ఇస్తే ఎన్నెన్ని ఘనకార్యాలు చేస్తామో వివరిస్తూ ఎన్నో ప్రణాళికలు వేస్తున్నా...." అన్నాడతడు అనన్యతో.

'మాలాంటి సామాన్య ప్రజానీకానికి కావలసింది కార్లలో వచ్చేవారు కాదు. మా సమస్యల్ని విమానాల్లోంచి చూసేవారు కాదు. మా కోసం ఏసీ రూముల్లో ప్రణాళికలు రచించే వారు కాదు. మా దగ్గరకి కాలినడకన వచ్చే వాళ్ళు. మమ్మల్నడిగి మాక్కావాల్సింది తెలుసుకుని మాకవసరమైన పథకాలు వేసేవాళ్ళు. వాటి అమల్లో సైతం మాకు పర్యవేక్షక పాత్ర నిచ్చేవాళ్ళు. పారదర్శకంగా పరిపాలించేవాళ్ళు!"

"నీకు ఏం కావాలంటే అదిస్తాను. జస్ట్ నీ నిరసన డైరెక్షన్ మారిస్తే చాలు. ప్రతిపక్షాల ముట్టడి కార్యక్రమం వల్లే ఇబ్బందుల పాలయ్యానని స్టేట్‌మెంటిస్తే చాలు మిగతా కథ నేను నడిపిస్తాను"

"వృత్తీ వ్యాపారాల్లాటివేమీ చెయ్యకుండా పారిశ్రామిక వేత్తలకీ కాంట్రాక్టర్లకీ ఉపకారం చేసో, అపకారం చేస్తామని బెదిరించో కోట్లు గడించే పొలిటీసియన్ని కాదు నేను"

"కాదు గనుకే నేనొచ్చాను. డైరెక్టుగా అడుగుతున్నా. నీకేం కావాలి? పర్మిట్టా ? కాంట్రాక్టా ? మెడికల్ సీటా ? హౌసింగుబోర్డు ఇల్లా ?"

"సారీ..."

"అదే నీ ఆఖరి మాటైతే నా మొదటి అస్త్రం ఏమిటో విను. నువ్వు నీ కుటుంబానికి కాకుండా పోతావ్. రెగ్యులైజ్ చెయ్యని మీ ఫ్లాట్‌ని కూల్చి మీ వాళ్ళని నడి రోడ్డు మీద పడేస్తారు. అర్థమైందనుకుంటాను"

ఆమె బెదర్లేదు.

కసిగా బూటు కాలితో నేలని తన్ని విసురుగా వెళ్ళి కారెక్కాడు అభిలాష్.

ఐ ఫోన్లో అనన్య ఫేస్‌బుక్ ఎక్కౌంట్ చూశాడు. లైక్‌లు యాభై లక్షల ఫిగర్ని సమీపిస్తున్నాయి. ఒక్క రోజులో...!

అతడు స్టేషన్‌కొచ్చి బెదిరించిన వార్త సైతం అందులో ఉండటం చూసి అదిరిపడ్డాడు. అతడి గుండెకు సైతం చెమటలు పట్టసాగాయి. ఆమెకి బుద్ధి చెప్పమని పోలీసు అధికారులకు 'హుకుం' జారీ చేశాడు.

* * *

రాత్రి పదిగంటల ప్రాంతంలో అనన్యని మహిళా పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

మర్నాడు పదిగంటల ప్రాంతాన అనన్యని కోర్టుకు తీసుకొచ్చారు పోలీసులు.

సంచలన కేసు అవడంతో మీడియా మోహరించింది.

ఆమె పోలీసు వ్యాన్లో ఉండగా లోపలికెళ్ళాడు ఏసీపీ. "రాత్రి ఇచ్చింది శాంపిల్ డోస్. అసలే అవినీతి ఆరోపణల్తో ప్రభుత్వం ఉక్కిరి బిక్కిరవుతోంది. నీ గొడవ ఇంకో ఇష్యూ అయిపోయింది. మర్యాదగా తలొంచితే మూడు నెలల్లో బయట పడిపోవచ్చు.

నోరు విప్పితే, నోరు పారేసుకుంటే నీ పిల్లలు..... తెలివైందానివిగా, క్లైమాక్స్ ఊహించుకో!"

అప్పారావుని అనన్యతో మాట్లాడనీయలేదు. దూరాన్నుంచే ఇల్లు కూల్చేస్తామని ఇచ్చిన నోటీసు ఊపి చూపాడు.

నారదుడు ఆమె దగ్గరికొచ్చాడు. ఒంటినిండా దెబ్బలతో ఉబ్బిన మొహంతో సరిగ్గా నడవలేకుండా ఉందామె.

"జనం ఏదో పొడిచేస్తారనుకోకండి. వాళ్ళు గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. ప్చ్... – ఈ దేశాన్ని బాగుచెయ్యడం ఎవరి వల్లా కాదు" అన్నాడతడు.

అనన్య కేసు సుబ్బారాయుడి కోర్టుకి వేశారని తెలిసి జుట్టు పీక్కున్నారు పోలీసు అధికారులు. "అతడసలే తల తిక్క మనిషి. ముందే ఎందుకు జాగ్రత్త పడలేదు?" అని విసుక్కున్నారు.

కోర్టు బోనులో ముద్దాయిగా నిలబడింది అనన్య.

అనన్య నిషేదాజ్ఞల్ని ఉల్లంఘించిందనీ, ప్రభుత్వోద్యోగుల విధులకు ఆటంకం కలిగించి దౌర్జన్యానికి పూనుకుందనీ ఆరోపించాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"నీ తరపున వాదించడానికెవరూ లేరా?" న్యాయమూర్తి సుబ్బారాయుడు అడిగారు.

అప్పారావు తెచ్చిన ప్లీడరే గాక మరి పది మంది ముందు కొచ్చారు. వారి సాయాన్ని సున్నితంగా తిరస్కరించిందామె.

"కోర్టు వారికేమైనా చెప్పుకోవాలనుకుంటున్నావా?"

"సామాన్యుడు గొంతు విప్పొచ్చని, అది నేరం కాదని భరోసా ఇస్తే చెప్పుకుంటాను"

"రాజ్యాంగం మీకు వాక్స్వాతంత్ర్యం ఇచ్చింది. మీ హక్కునెవరూ కాదన లేరు. నిర్భయంగా చెప్పుకోవచ్చు"

"నేను మామూలు గృహిణిని. మా ఇంటికెళ్ళే మార్గాన్ని ఎందుకు మూసేశారని అడిగాను. నోరు విప్పి అడిగిన పాపానికి అరెస్టు చేశారు. స్టేషన్లో ఎవరెవరో బెదిరించారు. రాత్రి నా మీద గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. కోర్టులో నోరు తెరిస్తే నా పిల్లల్నేదో చేసేస్తామని తాజాగా బెదిరించారు. మా ఇంటిని కూలదోస్తామంటూ రాత్రికి రాత్రే నోటీసు ఇచ్చారు. సగటు మనిషి గొంతు విప్పాలంటే ఆత్మ త్యాగానికి సిద్ధపడాలా జడ్జిగారూ?"

కోర్టు హాలు నిశ్శబ్దమైంది. మీడియా ప్రతినిధులు చకచకా మెస్సేజ్‌లిస్తున్నారు.

ఏదో చెప్పబోయిన పీపీని వారించి అన్నారు న్యాయమూర్తి–

"నిన్న ఏం జరిగింది? ఎవరెవరు బెదిరించారు? రాత్రి స్టేషన్లో ఆమె మీద దాడి చేసిందెవరు? ఇవాళ బెదిరించిందెవరు? ఇవన్నీ స్పష్టమవ్వాలి. ఇది తీవ్రమైన విషయం. ఎవర్నీ నమ్మలేని పరిస్థితి. అంచేత వీటన్నిట్నీ దర్యాప్తు చేసి రేపు డీజీపీ స్వయంగా కోర్టు

కొచ్చి సమగ్ర రిపోర్టు సమర్పించాల్సిందిగా ఆదేశిస్తున్నాను. ముద్దాయికి తక్షణం వైద్యం చేయడమే గాక డాక్టర్ల ప్యానల్ చేత పరీక్ష చేయించి రేపు కోర్టు కొచ్చి రిపోర్టు సమర్పించాల్సిందిగా హాస్పిటల్ సూపరింటెండెంటుని ఆదేశిస్తున్నాను"

పోలీసు వర్గాల గుండె ధ్వని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో ప్రతిధ్వనించింది.

అనన్య మీద అత్యాచారం జరిగి ఉంటుందన్న ఊహ జనాన్ని ఊపేసింది.

జనాగ్రహానికి ఫేస్‌బుక్ వేదిక అయ్యింది!

* * *

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంటు రాజారావు సెల్ మ్రోగింది.

"బాత్‌రూం దెబ్బలని రేపు రిపోర్టిచ్చి ఎల్లుండు మీ ప్రమోషన్ పేపర్లు తీసుకోండి"

ఎగిరి గంతేశాడు. ఇంకో రెండేళ్ళలో రిటైర్ కాబోతున్న తనకిది అయాచిత వరం!

ముగ్గురు డాక్టర్లతో ప్యానల్ని ఏర్పాటు చేశాడు. అనన్య గురించి లైట్‌గా రాయమని చెప్పి ఇంటికెళ్ళాడు.

"అనన్యకెలా ఉంది? బాగవుతుంది కదా?" గుమ్మంలోనే ప్రశ్నించిందతడి భార్య.

నీళ్ళు నమిలాడతడు!

* * *

'రాజారావుకి ప్రమోషన్ ఎర వేశారు' నారదుడు ఒక వార్తా ఛానల్‌కి ఉప్పు అందించాడు. అది బాంబులా పేలింది.

ఆ వార్త ఫేస్‌బుక్‌లో కామెంట్లని విపరీతంగా పెంచేసింది.

ప్రతిపక్షాలు అవినీతి అంశంతో బాటు అనన్య విషయమూ చేర్చి "వెంటనే ముఖ్యమంత్రి రిజైన్ చెయ్యాలి' అని డిమాండ్ చేశారు.

* * *

అనన్యని  ఆసుపత్రి నుంచి తిన్నగా కోర్టుకు తీసుకొచ్చారు.

రాష్ట్రం నలుమూలల్నుంచీ జనం పెద్ద ఎత్తున రావడంతో కోర్టు పరిసరాల్లో నిషేదాజ్ఞలు విధించారు. రెండు కిలోమీటర్ల దూరంలోనే జనాన్ని ఆపేశారు పోలీసులు. అవాంఛనీయ శక్తులు కుట్ర పన్నినట్లు సమాచారం అందిందన్నారు.

మెటల్ డిటెక్టర్లతో పరీక్షించి కోర్టు సంబంధితుల్నీ, కేసుల వారినీ, సాక్షుల్నీ మాత్రమే అనుమతించారు.

అయినా కోర్టు కిట కిట లాడిపోతోంది.

మొదట అనన్య కేసునే టేకప్ చేశారు న్యాయమూర్తి సుబ్బారాయుడు.

డీజీపీ, హాస్పిటల్ సూపరింటెండెంటు తమ రిపోర్టుల్ని సీల్డ్ కవర్లలో అందజేశారు.

అవి చదివారు న్యాయమూర్తి.

గత రెండ్రోజుల్లో జరిగినవి అతి సామాన్య ఘటనలనీ, మీడియా అతిగా స్పందించిందనీ డీజీపీ తన రిపోర్టులో పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో యువ ప్రతినిధులూ జర్నలిస్టులూ తప్ప వేరెవరూ కలవలేదన్నారు. బెదిరింపులు అబద్ధం అన్నారు. ఇంటి కూల్చివేత నోటీసు ఇప్పుడే అందటం యాదృచ్ఛికం అనీ, దానికీ దీనికీ సంబంధం లేదనీ తేల్చేశారు. మహిళా స్టేషన్లో ముద్దాయి తనకు తాను సానుభూతికోసం హింసించుకుందనీ, అప్పుడు లాకప్పులో ఉన్న మహిళలంతా ముక్త కంఠంతో తనకు చెప్పేరనీ పేర్కొన్నారు.

రాజారావు ఇంటా బయటా వస్తోన్న ప్రతిస్పందన చూసి అభాసుపాలవుతానన్న భయంతో ఉన్నదున్నట్టు రిపోర్టిచ్చాడు.

కనీసం ఇద్దరు వ్యక్తులు ఆమెని చీకట్లో కుళ్ళ బొడిచి ఉంటారనీ, వీపు మీదా వెన్ను మీదా ఎక్కువగా పిడిగుద్దులు లేదా గుండ్రని చెక్కరాడ్‌తో కొట్టి ఉండొచ్చన్నారు. జుట్టు మొదట్లో రక్తపు మరకలు గుర్తించినట్లు పేర్కొన్నారు.

డీజీపీని బోనులోకి పిలిచారు.

"మీ రిపోర్టుతో మీరు సంతృప్తి చెందారా?" న్యాయమూర్తి ప్రశ్నించారు.

"యస్ యువరానర్. 100%"

రాజారావు గుండె జారిపోయింది. మధ్యలో తనని 'బలి' తీసుకుంటారేమోనన్న భయపడుతూ బోనెక్కాడు.

రిపోర్టులోనిదంతా యదార్థమేననీ డాక్టర్ల ప్యానల్ అభిప్రాయంతో తాను కూడా ఏకీభవిస్తున్నాననీ చెప్పి చెమటలు తుడుచుకున్నాడు.

పీపీ లేచి రాత్రి అనన్యతో స్టేషన్లో ఉన్న మహిళా నేరస్తుల్ని సాక్షులుగా అనుమతించాల్సిందిగా అభ్యర్థించాడు.

ఒకామె వచ్చింది. తనని వ్యభిచార నేరం క్రింద అరెస్టు చేశారంది. ఆ రాత్రి అనన్యని ప్రక్క గదిలోకి తీసుకెళ్ళారనీ, ఆమె కేకలూ ఏడ్పులూ విన్పించాయనీ ఎలాంటి తొట్రుపాటూ లేకుండా చెప్పింది.

ఖంగు తిన్నారు పీపీ, డిజీపీ.

ఇంకొకర్నీ... మరొకర్నీ.....బోనెక్కించారు. అంతా అదేమాట నిర్భయంగా చెప్పారు.

కోర్టులో కలకలం లేచింది. సమాచారం అంది మీడియా ఫ్లాష్ న్యూస్‌తో రెచ్చిపోయింది. ముఖ్యమంత్రి తల పట్టుకున్నారు.

న్యాయమూర్తి సుబ్బారాయుడు చకచకా తీర్పు రాసి చదివారు.

"ఒక సామాన్య గృహిణి మీద ప్రభుత్వం బ్రహ్మాస్త్రం ప్రయోగించడం అమానుషం. అవాంఛనీయం. ప్రజల సంక్షేమం కోసం, సుఖ జీవనం కోసం కృషి చేయాల్సిన ప్రభుత్వం సామాన్య జీవనానికి ఆటంకాలు కల్పించటం దురదృష్టకరం. ఈ పరిణామం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రజలకు గాక అధికార గణానికి పోలీసులు లాయల్‌గా ఉంటూ తొత్తులుగా వ్యవహరించడం గర్హణీయం.

ఇక ముందెప్పుడూ ఇలా జరక్కుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి. కామన్ మేన్ ఈజ్ గ్రేట్. సామాన్యుడే మాన్యుడు అన్న భావనతో ప్రభుత్వమూ ఉద్యోగులూ పని చేయాలి. అవసరమైతే చట్టాల్లో తగిన మార్పులు తీసుకురావాలని చట్ట సభల్ని కోరుతున్నాను.

ఇక కేసు పూర్వాపరాలూ సాక్ష్యాలూ ముద్దాయి వాంగ్మూలం పరిశీలించాక ఈ కోర్టు ఒక నిర్ణయానికి వచ్చింది. ముద్దాయి నిర్దోషి అని భావించి భేషరతుగా విడుదల చేస్తున్నాను. వాస్తవాలను వక్రీకరిస్తూ రిపోర్టు సమర్పించిన రాష్ట్ర అత్యున్నత పోలీసు అధికారి ప్రవర్తన వారి హోదాకు తగినట్టు హుందాగా లేదు. వారిపై తగిన చర్య తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి సూచిస్తున్నాను....."

విజయ హాసం పెదాల మీద నర్తిస్తోంటే కోర్టు హాల్లోంచి రెట్టించిన ఆత్మవిశ్వాసంతో హుందాగా నడిచొచ్చింది అనన్య.

'జయహో సామాన్యుడా!' అన్నాడు నారదుడు.

"ఫేస్‌బుక్‌లో ఖాతాపెట్టి జనాన్ని చైతన్య పరిచింది మీరేనని నేను ఊహించగలను. థాంక్యూ" అందామె.

ఎలా వచ్చారో తెలీదు. పోలీసుల అడ్డంకుల్ని ఎలా అధిగమించారో తెలీదు. లక్షలాదిగా జనం-అంతా సామాన్యులే. మళ్ళీ వారిలో అధికంగా యువతీ యువకులు. బిగించిన పిడికిళ్ళు పైకెత్తి ఒక్క పెట్టున హర్ష ధ్వానాలు చేశారు.

"చూడండి జలసంద్రాన్ని తలపిస్తోన్న ఆ జనసంద్రాన్ని, ప్రజల సామూహిక చైతన్యమే ప్రజాస్వామ్యానికి ప్రాణం. ఇక మన దేశానికి తిరుగుండదు. మేరా భారత్ మహాన్!" గుండెలు పొంగించి మరీ చెప్పాడు నారదుడు.

జనం వంక అభినందన పూర్వకంగా చూసి చేతులు జోడించింది అనన్య.

ఒక నిశ్శబ్ద విప్లవం పురుడు పోసుకొంటోంది.

* * *

**(ఆంధ్రభూమి దినపత్రిక-16-11-2014)**
**(కన్నడంలోకి అనువదింపబడి, ప్రియాంక పత్రిక వారి అనువాద కథల పోటీలో ప్రథమ బహుమతి పొందింది - అక్టోబరు 2015)**